క్లుప్తంగా

ఆయిల్‌పామ్ రైతులకు ప్రోత్సాహక నిధులు విడుదల

బెల్లంపల్లి: అసెంబ్లీ నియోజకవర్గంలో ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులకు ప్రోత్సాహక నిధులు విడుదలైనట్లు బెల్లంపల్లి ఉద్యానవన శాఖ అధికారి సుప్రజ ఒక ప్రకటనలో తెలిపారు. అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం 59మంది రైతులు ఆయిల్‌పామ్ తోటల పెంపకం చేస్తున్నట్లు తెలిపారు. తోటలు సాగు చేస్తూ అంతర పంటలు పండిస్తున్న రైతులను ప్రోత్సహించడం కోసం రెండో సంవత్సరంలో మెయింటనెన్స్ నిర్వహణకు ప్రోత్సాహక నిధులను ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. ఎకరాకు రూ.4,200 చొప్పున 59మంది రైతులకు సంబంధించిన 234ఎకరాలకు రూ.9,83,575నిధులను సంబంధిత రైతుల బ్యాంకు ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. రైతులు శ్రద్ధగా తోటల పెంపకం చేయాలని సూచించారు.

వేలం ద్వారా ఆలయానికి రూ.2లక్షల ఆదాయం

చెన్నూర్: పట్టణ సమీపంలో గల మదనం పోచమ్మ ఆలయ ప్రాంగణంలో పూజా సామగ్రి, శీతల పానీయలు విక్రయించేందుకు మంగళవారం నిర్వహించి బహిరంగ వేలంను రూ.2లక్షలకు కురుమ అన్వేశ్ గౌడ్ అనే వ్యక్తి దక్కించుకున్నారని దేవాదాయ ధర్మదాయ శాఖ ఏవో ముక్త రవి తెలిపారు. వేలాన్ని దక్కించుకున్న వారికి 1జూలై 2024 నుంచి 30జూన్ 2025వరకు గడువు ఉంటుందని తెలిపారు. అర్చక సిబ్బంది పాల్గొన్నారు.

శిఖం భూమి కబ్జాపై విచారణ

తాండూర్: మండలంలోని అచ్చలాపూర్ గ్రామ శివారులోని రాంపూర్ చెరువు శిఖం భూమి కబ్జాపై మంగళవారం ప్రభుత్వ శాఖల అధికారులు విచారణ చేశారు. బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ ఆధ్వర్యంలో రెవెన్యూ, సర్వే, నీటి పారుదల శాఖ అధికారులు సర్వే చేపట్టారు. ఓ రైతు శిఖం భూమిని కబ్జా చేసినట్లు సర్వేలో నిర్ధారించారు. కబ్జా చేసిన వ్యక్తిపై వెంటనే చర్యలు తీసుకోవాలని, చెరువు మత్తడి లెవల్‌ను వెంటనే పెంచాలని ఆర్డీవో అధికారులకు సూచించారు. తాండూర్‌లో రైల్వే శాఖకు చెందిన సర్వే నంబర్ 612లో ఉన్న రైతుల పట్టా భూమిపై కూడా ఆర్డీవో విచారణ చేశారు. రెవెన్యూ రైల్వే శాఖ అధికారులు మ్యాపులను ఆర్డీవో పరిశీలించారు.

మైనింగ్ స్టాఫ్ కమిటీ ఎన్నిక



ఎన్నికైన కమిటీ సభ్యులు

శ్రీరాంపూర్: గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అనుబంధ మైనింగ్ స్టాఫ్ సబ్ కమిటీ ఎన్నిక జరిగింది. సీసీసీలోని నరసయ్య భవన్‌లో సోమవారం రాత్రి జరిగిన ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ ముఖ్య అతిథులుగా డిప్యూటీ జనరల్ సెక్రెటరీలు వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శిగా బాజీసైదాలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏరియా మైనింగ్ స్టాఫ్ సబ్ కమిటీని ఎన్నుకున్నారు. సబ్ కమిటీ ఏరియా ఉపాధ్యక్షులుగా భగవత్ బాలకృష్ణ, ఏరియా సెక్రెటరీగా మారేపల్లి బాబు, సహకార కార్యదర్శిగా ఉప్పరి చంద్రశేఖర్, జాయింట్ సెక్రెటరీగా రాజశేఖర్, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీగా రామాజీ, ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా పాటు గౌసిద్దిన్ పవన్ కుమార్, రావి రమేష్‌లను ఎన్నుకున్నారు. మైనింగ్ స్టాఫ్ సమస్యల కోసం నూతన కమిటీ కృషి చేస్తుందని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొముర‌య్య, నాయకులు పాల్గొన్నారు.

28న బ్రెస్ట్ స్క్రీనింగ్ క్యాంపు

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని రామకృష్ణాపూర్ సింగరేణి ఏరియా ఆసుపత్రిలో ఈ నెల 28న మహిళలకు బ్రెస్ట్ స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించనున్నట్లు ఏరియా పర్సనల్ మేనేజర్ సల్ల శ్యాంసుందర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి వారితో శుక్రవారం ఉదయం 8గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు క్యాంపు ఉంటుందని తెలిపారు. 45సంవత్సరాల పైబడిన బాధిత మహిళలు, ఉద్యోగులపై ఆధారపడిన మహిళలు వారి పేర్లు నమోదు చేసుకోవాలని, 100మంది మహిళలకు మాత్రమే అవకాశం ఉందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

శ్రీరాంపూర్: వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ తప్పక పాటించాలని శ్రీరాంపూర్ సీఐ మోహన్ తెలిపారు. శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్ వద్ద మంగళవారం వాహనాల డ్రైవర్లు, ఓనర్లతో సమావేశం ఏర్పాటు చేసి ట్రాఫిక్ రూల్స్ గురించి తెలియజేశారు. ప్రతీ ఆటోకు రిజిస్ట్రేషన్, ఇన్సురెన్సు, ఫిట్‌నెస్ తప్పనిసరిగా ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. డ్రైవింగ్ లైసెన్సు కూడా రద్దు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై సంతోశ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నమోదులో లోపం.. అర్హులకు శాపం

- ప్రజాపాలన దరఖాస్తుల సవరణలో ఎడిట్ ఆప్షన్ లేక..
- గృహజ్యోతి, మహాలక్ష్మి అర్హుల ఇబ్బందులు



సవరణ కోసం ఎంపీడీవో కార్యాలయం వద్ద దరఖాస్తుదారులు

దండేపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వ ఆరుగ్యారంటీల్లో గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలు అర్హులందరికీ అందడం లేదు. దరఖాస్తులను ఆన్‌లైన్ చేసే క్రమంలో డేటా ఎంట్రీ ఆపరేటర్లు చేసిన తప్పిదాలు కొంత మంది అర్హుల పాలిట శాపంగా మారాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని అర్హతలు ఉన్నప్పటికీ, జిల్లాలో 200యూనిట్ల లోపు విద్యుత్‌ను ఉచితగా పొందే అవకాశంతో పాటు, మహాలక్ష్మి పథకం ద్వారా రూ.500కే గ్యాస్ సిలిండర్ పొందే అవకాశాన్ని చాలామంది కోల్పోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరుగ్యారంటీల పథకాల లబ్ధిదారుల ఎంపికకు ప్రజాపాలన కార్యక్రమాన్ని చేపట్టింది. గతేడాది డిసెంబర్ 28నుంచి జనవరి 6వరకు గ్రామాల్లో ప్రజాపాలన సభలు నిర్వహించి, దరఖాస్తులు స్వీకరించింది. దరఖాస్తు పత్రాల్లో అవసరమున్న పథకాల లబ్ధికోసం టిక్ పెడితే చాలు అని చెప్పడంతో, దరఖాస్తుదారులు అదే పనిచేశారు.

ఎడిట్ ఆప్షన్ లేక...

ప్రజాపాలనలో ప్రజలు అందించిన దరఖాస్తులను ఆన్‌లైన్ చేసే క్రమంలో తప్పులు దొర్లి, అర్హత ఉన్న కొంతమందికి ప్రభుత్వ పథకాలు అందకుండా పోయాయి. దీంతో వాటిని సవరించుకునేందుకు అవకాశం కల్పించారు. మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి, సవరిస్తున్నారు. అయితే సవరణలో మాత్రం డేటా ఎంట్రీ నమోదులో దొర్లిన కొన్ని పొరబాట్లను సవరించుకునేందుకు మాత్రమే అవకాశం ఉంది. 'నాట్ మ్యాచింగ్' ఆప్షన్ ఇచ్చినవాటిని మాత్రమే సరిచేస్తున్నారు. 'నాట్ అప్లయ్' అని ఉన్నవాటిని మాత్రం సరిచేసేందుకు ఎడిట్ ఆప్షన్ లేదు. ఈ సమస్యతో అర్హత కోల్పోయిన దరఖాస్తుదారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఈ సమస్యతో లబ్ధి పొందలేకపోయిన వారికి 'ఎడిట్' ఆప్షన్ ఇవ్వకపోవడంతో సిబ్బంది చేతులెత్తేస్తున్నారు. ఎడిట్ ఆప్షన్ ఇస్తే తప్పా ఏమీ చేయలేం అంటున్నారు. కేవలం మిస్ మ్యాచ్‌డ్ అని ఉన్న వాటికి ఎడిట్ ఆప్షన్ ఉండటంతో, వాటిని సరిచేస్తున్నారు. కొన్నింటికి మ్యాచ్‌డ్ అంటే ఒక దరఖాస్తు దారుని నంబర్‌కు, ఇంకో దరఖాస్తుదారుడి విద్యుత్ మీటర్ నంబర్ తప్పుగా జత చేయడంతో అలాంటివి మ్యాచ్‌డ్ అని కనిపిస్తుంది. కానీ ఇలా ఉన్న వాటిని కూడా సరిచేసేందుకు ఎడిట్ ఆప్షన్ తప్పనిసరి అంటున్నారు. ఎడిట్ ఆప్షన్ లేక తప్పులు సరిచేయకపోవడంతో సమస్య పరిష్కారం కోసం అర్హులందరూ ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారు.

తొందర పాటు వల్లే లోపాలు..

ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేసేందుకు ప్రైవేటు వ్యక్తులను నియమించి, ఒక్కో దరఖాస్తుకు ఇంత అని చెప్పడంతో, ఎక్కువ దరఖాస్తులు ఎంట్రీ చేసేందుకు పోటీపడ్డ క్రమంలో అన్ని తప్పులు దొర్లినట్లుగా ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దరఖాస్తుల్లో గృహజ్యోతికి, మహాలక్ష్మికి, టిక్ మార్కు చేసిన కొందరికి డేటా ఎంట్రీ ఆపరేటర్లు నాట్ అప్లయ్ అని నమోదు చేశారు. దీంతో గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలకు అర్హులైన వారికి కూడా అన్యాయం జరిగింది. ప్రజాపాలన దరఖాస్తుల్లో దొర్లిన తప్పులను సవరించుకునేందుకు ఎడిట్ ఆప్షన్ ఇచ్చి అర్హులకు న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు.

ఎడిట్ ఆప్షన్ లేక ఇబ్బంది

ప్రజాపాలన దరఖాస్తుల్లో దొర్లిన తప్పులు సవరించేందుకు ఎడిట్ ఆప్షన్ ఇవ్వలేదు. ఎడిట్ ఆప్షన్ లేక పోవడంతో, తప్పులు సరిచేయలేకపోతున్నారు. నాట్ అప్లయ్ అని నమోదు చేయడంతో, జీరో బిల్లుకు, మహాలక్ష్మికి అర్హులు కాలేకపోతున్నారు. సమస్య రాష్ట్రవ్యాప్తంగా ఉంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఎడిట్ ఆప్షన్ వస్తేనే సరిచేసేందుకు అవకాశం ఉంటుంది.

– ప్రసాద్, ఎంపీడీవో, దండేపల్లి

అటెన్షన్ ప్లీజ్..

చేతికందేలా విద్యుత్ తీగలు



దండేపల్లి: మండల కేంద్రం సమీపంలో ఓ పంట పొలంలో విద్యుత్ తీగలు చేయి పైకెత్తితే తాకేలా వేలాడుతున్నాయి. విషయాన్ని విద్యుత్ అధికారులు, సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా సరిచేయడం లేదని పలువురు రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం పంట కాలం ప్రారంభం కావడంతో, పొలాలకు వెళ్లే, వేలాడే విద్యుత్ తీగలతో ప్రమాదం పొంచి ఉన్నందున సంబంధిత అధికారులు స్పందించి లూజ్ వైర్లను సరిచేయాలని కోరుతున్నారు.

సంబంధిత అధికారి : రాయనర్సు, విద్యుత్ ఏఈ | ఫోన్ నంబర్ : 9440811718

అంగన్‌వాడీ కేంద్రాల్లో మెరుగైన సేవలు అందించాలి



మాట్లాడుతున్న సీడీపీవో ఉమాదేవి

బెల్లంపల్లిరూరల్: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు, లబ్ధిదారులకు మెరుగైన సేవలందించి మన్ననలు పొందాలని ఐసీడీఎస్ సీడీపీవో మాసు ఉమాదేవి అన్నారు. మండలంలోని గురిజాల రైతువేదికలో మంగళవారం నెన్నెల మండల అంగన్‌వాడీ టీచర్లకు పూర్వ ప్రాథమిక విద్య, పాఠ్య ప్రణాళిక పైన శిక్షణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ.. చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన విద్య అందించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నేర్పించిన అక్షరాలే వారి జీవితానికి తొలి మెట్టుగా నిలుస్తాయన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం, పథకాలు ప్రతి ఒక్క లబ్ధిదారులకు చేరేలా చొరవ తీసుకోవాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖపరమైన చర్యలు తప్పవన్నారు. అనంతరం పలు అంశాలపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు జ్యోతి, సుజాత, రాధిక, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

మెరిట్ స్కాలర్‌షిప్ చెక్కుల పంపిణీ



చెక్కు అందిస్తున్న ఏరియా జీఎం మనోహర్

మందమర్రిరూరల్: మందమర్రిలో ఏరియాలోని విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల పిల్లల్లో మెరిట్ విద్యార్థులకు యాజమాన్యం మెరిట్ స్కాలర్‌షిప్ మంజూరు చేసింది. ఏరియాలోని ఈఎం ఆఫీస్ ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కేకే–5 గని ఆఫీస్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తించే సముద్రాల బుచ్చయ్య కుమారుడు సాకేత్ ఎంబీబీఎస్(ఐదో సంవత్సరం), ఆర్కే ఓసీలో ఈపీ ఆపరేటర్‌గా విధులు నిర్వహించే దుంపేటి శంకర్ కుమార్తె అనీల ఎంబీబీఎస్ (ఐదో సంవత్సరం)కు మెరిట్ స్కాలర్‌షిప్ మంజూరు కాగా వారికి చెక్కులు అందజేశారు. సమావేశంలో ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, ఆఫీస్ సూపరింటెండెంట్ రాయలింగు, అధికారులు, యూనియన్‌ల ప్రతినిధులున్నారు.

అటవీ ఆంక్షలు ఎత్తివేయాలని పాదయాత్ర



ఇందన్‌పల్లిలో మాట్లాడుతున్న భూమాచారి

జన్నారం: అటవీశాఖ పెట్టిన ఆంక్షల వల్ల వాహనాల రాకపోకలు లేక జన్నారం మండల వ్యాపారులు నష్టపోతున్నారని, ఆంక్షలు ఎత్తివేసి భారీ వాహనాల రాకపోకలు పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ సామాజిక వేత్త శ్రీరాముల భూమాచారి, స్థానిక వ్యాపారులు పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. మండలంలోని ఇందన్‌పల్లి గ్రామంలో మంగళవారం పాదయాత్ర ప్రారంభించారు. గ్రామంలో తిరుగుతూ గ్రామస్తులకు అటవీ అధికారుల ఆంక్షల పై అవగాహన కల్పించారు. ఎందుకు నష్టపోతామనే అంశాలు తెలియపరిచారు. భారీ వాహనాల రాకపోకలు నిలిపివేయడం వల్ల హోటళ్లు, కిరాణ దుకాణాల వ్యాపారులు నష్టపోతున్నారని, జన్నారం అభివృద్ధి ఆగిపోతుందని పేర్కొన్నారు. ఈ మేరకు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు అందరం ఐక్య పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట సీపీఐ కార్యదర్శి దాసరి తిరుపతి, నాయకులు కొండపల్లి మహేశ్, అశోక్, వినయ్, కిశోర్, సుదర్శన్ తదితరులున్నారు.

రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకులో రక్తదానం



రక్తదానం చేస్తున్న దాతలు

మంచిర్యాలటౌన్: పట్టణంలోని వైభవ్ జ్యువెల్లర్స్ యజమాని గ్రంధి మనోజ్‌కుమార్ జన్మదినం సందర్భంగా మంగళవారం స్థానిక ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలోని రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకులో రక్తదానం చేశారు. జ్యువెల్లర్స్ ప్రొప్రైటర్ గ్రంధి మల్లిక రత్నకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో దాతలు రక్తదానం చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు వి.మధుసూదన్‌రెడ్డి, కోశాధికారి కె.సత్యపాల్‌రెడ్డి, ఎం.సత్యనారాయణరెడ్డి, చుంచు శంకరయ్య, జువెల్లర్స్ బ్రాంచి మేనేజర్ వినయ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



మాట్లాడుతున్న ఎస్సై ప్రవీణ్‌కుమార్

కాసిపేట: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని యువత ఆన్‌లైన్ గేమ్స్, లోన్లపై జాగ్రత్తలు పాటించాలని కాసిపేట ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని మోడల్‌స్కూల్ కాలేజీలో మంగళవారం గంజాయి, మత్తుపదార్థాల నిర్మూలన, సైబర్ క్రైమ్స్ ఆత్మహత్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అందె నాగమల్లయ్య, ఉపాధ్యాయుడు గణేష్, బ్లూకోర్ట్ సిబ్బంది రాజేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ రోజు

విద్యాసంస్థల బంద్ పాటించండి

బెల్లంపల్లి: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 26న రాష్ట్రంలో విద్యాసంస్థల బంద్ నిర్వహిస్తున్నట్లు ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దీపక్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దందాను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఖాళీగా ఉన్న డీఈవో ,ఎంఈవో పోస్టులు భర్తీ చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని పేర్కొన్నారు. ఏళ్ల తరబడి నుంచి విద్యారంగ సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చినా అశ్రద్ధ చేస్తున్నారని, ఎన్నిసార్లు ప్రభుత్వ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోతోందని వాపోయారు. ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కాక ఇబ్బందులు పడుతుంటే మరో పక్క ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ఫీజుల పేరుతో దోపిడీ చేస్తున్నారని తెలిపారు. సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఏమాత్రం శ్రద్ధ లేనట్లుగా కనిపిస్తోందని తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. బంద్‌ను అన్ని వర్గాలు విజయవంతం చేయాలని ఆయన కోరారు.

చెన్నూర్: విద్యా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏబీవీపీ బుధవారం తలపెట్టిన విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు మామిడి అక్షిత తెలిపారు. బంద్‌కు ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల యాజమాన్యాలు సహకరించాలని కోరారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

భీమారం: మండలంలోని 11గ్రామపంచాయతీల్లో బుధవారం మధ్యాహ్నం 1గంట నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈ కుమారస్వామి మంగళవారం తెలిపారు. మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోగా, దానిస్థానంలో మరొకటి అమర్చే పనులు చేయనున్నట్లు తెలిపారు. ప్రజలకు జరుగుతున్న అసౌకర్యాన్ని గమనించాలని ఏఈ కోరారు.

ఊరు పోచమ్మ కొలుపు

చెన్నూర్‌రూరల్: మండలంలోని గంగారం గ్రామంలో బుధవారం ఊరు పోచమ్మ కొలువు ప్రారంభించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ కొలుపు గురువారం మధ్యాహ్నం వరకు ఉంటుందని, కావున గ్రామానికి ఇతర గ్రామాల నుంచి ఎవరూ రావొద్దని పేర్కొన్నారు. ఈ ఏట వర్షాలు సంవృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని, అందరూ సుఖః సంతోషాలతో ఉండాలని గ్రామ దేవతలకు ఈ కొలుపు కొలుస్తున్నట్లు వారు తెలిపారు.

ప్రజావాణి దరఖాస్తుపై సమీక్ష



రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్, అటవీ రేంజ్ అధికారి గోవింద్ చంద్ సర్దార్

వేమనపల్లి: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణిలో మండలంలోని రాజారాంకు చెందిన గిరిజనులు ఇచ్చిన అర్జీలపై తహసీల్దార్ రమేష్ కుశ్నపల్లి అటవీ రేంజ్ అధికారి గోవింద్ చంద్ సర్దార్ సమీక్ష చేశారు. గోదాంపేట శివారు గతంలో రెవెన్యూ శాఖ ఇచ్చిన పట్టాలు ఉండగా, ఆ భూమిని అటవీశాఖ సాగు చేసుకోనివ్వడం లేదని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై తహసీల్దార్ రేంజ్ అధికారిని పిలిపించి భూమి రికార్డులను పరిశీలించారు. రెవెన్యూ రికార్డుల్లో గోదుంపేట శివారు సర్వే నం.3గా ఉండగా, అదే భూమి అటవీ శాఖ రికార్డుల్లో గిరివెల్లి ఎక్స్‌టెన్షన్ బ్లాక్ రిజర్వు ఫారెస్ట్‌గా ఉంది. అటవీభూమి అయినందునే భూమిని సాగు చేసుకోనివ్వడం లేదని రేంజర్ తహసీల్దార్‌కు విన్నవించారు. ఈ భూమిలో రెవెన్యూ శాఖ 20సంవత్సరాల క్రితం వేమనపల్లి, రాజారాంకు చెందిన నిరుపేదలకు పట్టాలివ్వగా అటవీ శాఖ అది రిజర్వు ఫారెస్ట్ అని చెబుతూ సాగు చేసుకోనివ్వడం లేదు. అది అటవీ భూమి అయినందునా గత ప్రభుత్వం ఇచ్చిన ఆర్ ఓఎఫ్ఆర్ పట్టాల్లో రాజారాం గ్రామానికి చెందిన 12మంది గిరిజనులకు ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు ఇచ్చామని అటవీ రేంజర్ తహసీల్దార్‌కు వివరించారు. ఈ భూ వివాదం ఐదు సంవత్సరాలుగా హైకోర్టు పరిధిలో ఉందని తెలిపారు. హైకోర్టు తీర్పు వెలువడేంత వరకు భూమి అటవీ శాఖ, రెవెన్యూ భూమి అని నిర్ధారించలేమని ఇరు శాఖలు ఓ నిర్ణయానికి వచ్చారు. కొత్తగా ఆ భూమిలో సాగుకు యత్నిస్తే కేసులు పెట్టాల్సి వస్తుందన్నారు. రెండు రోజుల్లో రెవెన్యూ, అటవీ శాఖల ఆధ్వర్యంలో క్షేత్ర స్థాయి పరిశీలన చేయనున్నట్లు తహసీల్దార్, రేంజ్ అధికారి వెల్లడించారు. వీరి వెంట ఎఫ్ఎస్‌వోలు బేగ్, శ్రీలత, ఆర్ఐ లక్ష్మణ్ ఉన్నారు.

షంషీర్‌నగర్‌లో మళ్లీ భూ ఆక్రమణలు

బెల్లంపల్లి: బెల్లంపల్లి షంషీర్‌నగర్‌లో మళ్లీ భూ ఆక్రమణలు మొదలయ్యాయి. రెవెన్యూ అధికారులు గతంలో కూల్చివేతలకు పాల్పడిన ప్రాంతంలోనే తాజాగా కొందరు అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారు. బుధకలాన్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 170లో ఉన్న ప్రభుత్వ భూమిని ఎప్పటికప్పుడు ఏదో రకంగా కబ్జా చేయడానికి అక్రమార్కులు యత్నాలు చేస్తున్నారు. షాదీఖానా వెనకాల కొందరు గతంలో అక్రమంగా నిర్మాణాలు చేశారు. ఆర్డీవో, రెవెన్యూ అధికారులు ఆ ప్రాంతాన్ని సందర్శించి ప్రభుత్వ భూమిలో కట్టిన కట్టడాలను కూల్చివేయించగా, కొద్దిరోజుల విరామం తర్వాత నిర్మాణ పనులు మళ్లీ చేపట్టడం చర్చనీయాంశమైంది. అదేతీరుగా అంబేద్కర్‌నగర్‌కు వెళ్లే మార్గంలో షాదీఖానాకు ముందు పదావుగా ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని బేష్‌మెంట్ నిర్మాణం చేసినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ భూమి కావడంతో కబ్జాదారులు బరితెగిస్తున్నారు. ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా ఎప్పటికప్పుడు రక్షణ చర్యలు తీసుకోవాల్సి ఉన్నా, రెవెన్యూ అధికారులు ఉలుకు పలుకు లేకుండా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. కొందరు ప్రభుత్వ భూమికి నకిలీ పత్రాలు సృష్టించి క్రయ విక్రయాలు సాగించడం పరిపాటిగా మారింది. రెవెన్యూ అధికారులు ఉదాశీన వైఖరీని విడనాడి ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని కాపాడటానికి తక్షణ చర్యలు తీసుకోవాలని బస్తీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

'రైతుభరోసా'పై వీడియో కాన్ఫరెన్స్



కిష్టంపేట రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామంలోని రైతువేదికలో రైతు భరోసా పథకంపై వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వ్యవసాయశాఖ అధికారులు, రైతులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు భరోసా విధివిధానాలపై తెలియజేశారు. ఈ కాన్ఫరెన్స్‌లో ఏడీఏ రాజేశం, నియోజకవర్గ ఏవోలు శ్రీనివాస్, మహేందర్, మార్క్‌గ్లాడ్‌స్టన్, ఏఈవోలు పాల్గొన్నారు.

భీమిని: రైతు భరోసా స్కీంపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని మంగళవారం భీమిని రైతువేదికలో నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమం ద్వారా మంత్రి రైతు భరోసా స్కీంపై పలు సలహాలు, సూచనలు రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతుల అభిప్రాయాల ప్రకారం స్కీంను ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీలోని 31వ వార్డులోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆ వార్డు కౌన్సిలర్ సురేష్ బల్దువా మంగళవారం మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. కాలేజీరోడ్డులో జేసీబీతో తవ్విన రోడ్డును పూడ్చాలని, రైల్వే లైన్ పక్కన ఉన్న డ్రెయినేజీలోని చెత్తను తొలగించాలని, పాత రైల్వే గేటు వద్ద వేస్తున్న సీసీ రోడ్డుకు నీరు పట్టాలని కోరారు.

నూతన బోర్‌వెల్ పనులు ప్రారంభం

కోటపల్లి: మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో నీటిసమస్యతో విద్యార్థుల హాజరుశాతం తగ్గడంతో పాటు ఉన్న విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనే విషయాన్ని ఎంపీపీ మంత్రిసురేఖా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ స్పందించి నూతన బోరు నిర్మాణానికి రూ.1లక్షా 50వేలు కేటాయించగా మంగళవారం ఎంపీపీ మంత్రి సురేఖా నూతన బోరు నిర్మాణ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్‌వో హరిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

బోరు మోటార్‌కు పూర్వవిద్యార్థుల విరాళం

దండేపల్లి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బోరు మోటార్‌కు, పాఠశాలలో చదివిన 2003–04 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు రూ.10వేల విరాళాన్ని పాఠశాల హెచ్ఎం శంకర్‌గౌడ్‌కు మంగళవారం అందించారు. పాఠశాలలో సౌకర్యాలు మెరుగుపర్చడంలో పాఠశాల పూర్వ విద్యార్థులు ముందుకొచ్చి సాయం అందించడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయుడు రాజేశ్వర్‌రావు, పూర్వ విద్యార్థులు కుమారస్వామి, భూమన్న, నగేష్, శ్రీధర్, సుధాకర్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

'గృహజ్యోతి' దరఖాస్తుల సవరణ

వేమనపల్లి: గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాల్లో అర్హత ఉండి రానివారు మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకొని, సవరణ చేయించుకోవాలని ట్రాన్స్‌కో ఏఈ దీక్షిత్ ఒక ప్రకటనలో తెలిపారు. కొందరు దరఖాస్తు చేసుకునే క్రమంలో రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, ఇతర దరఖాస్తు పత్రాలు తప్పుగా ఇవ్వడంతో పొరపాట్లు జరిగాయని, వాటిని సవరించుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం మరో అవకాశం ఇచ్చిందని పేర్కొన్నారు. జీరో బిల్లు రాని వారు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

అధిక ఫీజులు తగ్గించాలి

జన్నారం: కొందరు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం అత్యధిక ఫీజులు వసూలు చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, అత్యధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలల్లో ఫీజులు తగ్గించేలా తగు చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు జంగం సంతోష్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అదే విధంగా పుస్తకాలు మోతాదుకు మించి ఇస్తున్నారని, పుస్తకాల బరువు తగ్గించేలా చూడాలన్నారు.

పేదకుటుంబానికి బియ్యం అందజేత

భీమారం: మండల కేంద్రానికి చెందిన కలగూర బాపు కుటుంబానికి కాంగ్రెస్ నాయకులు దుర్గం రాజు, నక్క సంపత్, మంతెన సమ్మయ్యతో కలిసి 50కిలోల బియ్యం అందజేశారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు

మందమర్రిరూరల్: పెద్దపల్లి ఎంపీగా గడ్డం వంశీకృష్ణ భారీ మెజార్టీతో గెలిచి పార్లమెంట్‌లో ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా మందమర్రిలో మంగళవారం కాంగ్రెస్ నాయకులు సంబురాలు జరుపుకున్నారు.